# ప్రేమ - పెళ్లి

ప్రతిరోజూ ప్రొద్దునే అలారం కొట్టగానే, ఆదివారం హాయిగా చాలాసేపు నిద్రపోవాలి అని అనుకుంటాను. కాని విచిత్రంగా ఆరోజు ఆరున్నరకే మెళకువ వస్తుంది.

ఆవేళ ప్రొద్దునే లేచి ఏమీతోచక మల్లెపువ్వులు కుప్పగా ముందు పోసుక్కూచున్నాను మాలగా కట్టడానికి. ఇంతలో గేటు తోసుకుని సుశీల లోపలికివచ్చింది, హడావిడిగా ఉన్నట్లుంది. ప్రొద్దున్నే ఎందుకువచ్చింది చెప్మా అనుకున్నాను. సుశీల నా సహోద్యోగి. మా కాలేజీలోనే పని చేస్తోంది. ప్రత్యేకించి నాకు ఫ్రెండు కంగారుగా లోపలికి వచ్చింది. అప్పుడు చూశాను. చేతిలో కుంకుమభరిణి ఉంది. నా ముఖాన బొట్టుపెట్టి చెప్పింది. "రేపు మా చెల్లెలు పెళ్ళి. నువ్వు తప్పకుండా రావాలి" అన్నది. శుభలేఖ చేతికిచ్చింది. నాకు షాక్ తగిలినట్లయింది. ఏమిటిది హఠాత్తుగా ఈ పెళ్ళి! మొన్న కాలేజీకి వచ్చింది. అప్పుడేమీ చెప్పలేదు. విషయం ఏమిటో తెలుసుకోవాలని నాకు చెప్పలేని కుతూహలంగా ఉంది. అందుకని "ఇంత తొందరగా పెళ్ళి ఏమిటి, నీవు నాతో చెప్పనేలేదే. రా కూర్చో" అన్నాను, మల్లెపూలదండ ఒక పక్కకు నెట్టుతూ. అది సందిగ్ధంలో ఉంది. "వెళతాను. ఇంకా చాలా పనులున్నాయి. పెళ్లి అనుకోకుండా కుదిరింది" అంది. అయినా కదల్లేదు. తటపటాయిస్తోంది. దానికి కూర్చుని సావకాశంగా అన్నీ నాతో చెప్పాలనుంది బలవంతంగా కుర్చీలో కూర్చోపెట్టాను. మంచి నీళ్ళడిగింది. ఇచ్చాను తరువాత వివరాలు అదే చెప్పింది. "ఈ పెళ్ళి ఇప్పుడు చెయ్యాలనుకోలేదు. అసలు ఈ సంబంధం

మాకెవరికి అంతగా ఇష్టంలేదు. కాని మా చెల్లి పట్టుబడుతోంటే ఒప్పుకోక తప్పలేదు. నీకు తెలుసుగా, ఈ మధ్య మా చెల్లెలు మా అక్కయ్యగారింట్లో ఉంటోంది బెంగుళూరులో. అక్కడ వాళ్ళ పక్కింటి వాళ్ళబ్బాయి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడుట. ఓ నెలరోజులు సెలవు మీద వచ్చాడుట. ఎట్లాగో అతనికి దీనికీ స్నేహం కలిసింది. అతనికి మళ్ళా సెలవు దొరకదు. ఇప్పుడే పెళ్ళిచేసుకుని అతనితో వెళ్ళిపోతానని పట్టుబడుతోంది" చెమట తుడుచుకుని ఊపిరి పీల్చుకుంది. నా ముఖం విప్పారింది. "అమెరికాలో ఉంటున్నాడా? అయితే, ఇంకేం, మంచి సంబంధమేగా? మీ కెందుకు ఇష్టంలేదు" అన్నాను తాపీగా. ఎట్లాంటి నీళ్ళయినా శంఖంలో పోస్తే తీర్థమైనట్లు ఈ రోజుల్లో ఎట్లాంటివాడయినా సరే అమెరికా వెళ్ళివస్తే గొప్పవాడైపోతాడు. ఇంక అక్కడే ఉండిపోతే చెప్పనక్కరలేదు. సుశీల మళ్ళీ చెప్పింది "సంబంధం మంచిదే. పిల్లవాడి తండ్రి ఇంజనీరువేసి రిటైరు అయ్యాడు. ఒక్కడే కొడుకు. మనవాళ్ళే, అన్నీ బాగున్నాయి. కాని పిల్లవాడు కారునలుపు. అదీ మాకు నచ్చలేదు. మా చెల్లిని చూశావుగా! తెల్లగా బొమ్మలా ఉంటుంది. ఇద్దరికి ఈడూజోడూ కుదరలేదు. అదే మాకు కొరత, అయినా అది ఎంత చెప్పినా వినటంలేదు. అందుకే హడావిడిగా ముహూర్తం పెట్టుకున్నాము. రేపు పొద్దున రాములవారి గుళ్ళో పెళ్ళి. పై వారం ఇద్దరూ అమెరికా వెళ్ళిపోతారు. నువ్వు తప్పకుండా రా!" అంటూ లేచింది. నేనూ లేచాను సాగనంపడానికి. సుశీలను ఓదారుస్తూ ధైర్యం చెప్పడానికన్నాను "ఫరవాలేదులే! నల్లగా ఉంటేయేం, గుణం మంచిదీ కావాలి" అని సుశీల కాస్త సంతోషంగా అంది. "అవును, గుణం మంచిదీ కావాలి."

మర్నాడు ఉదయం పెళ్ళికి వెళ్ళాను. రాములవారి గుడి మండపంలో పెళ్ళి జరుగుతోంది. ఎక్కువమంది లేరు. దగ్గర బంధువులను, స్నేహితు

లను మాత్రం పిలిచినట్లున్నారు. మా కాలేజీవాళ్ళు ఒకరిద్దరు కనిపిస్తే వెళ్ళి వాళ్ళపక్కన కూర్చున్నాను. పెళ్ళికొడుక్కు పెళ్ళికూతురుకు మధ్య తెర కట్టారు. ఇరుగుపొరుగు అందరిని చూస్తూ కూర్చున్నాను. ఎవరెవరి పట్టు చీరలు బాగున్నాయో, ఎవరెవరి నెక్‌లెస్‌లు అందంగా ఉన్నాయో పరీక్షిస్తూ. కాస్సేపటికి తెరదీశారు. అప్పుడు చూశాను పెళ్ళికొడుకును. చూడగానే ఎక్కడో చూసిన ముఖం అనిపించింది. కాస్సేపటికి గుర్తువచ్చింది. అతని పేరు నందన్. శుభలేఖలో గిరినందన్ అని ఉంటే నేను గుర్తించలేక పోయాను. అతన్ని నేను ఎరుగుదును. ఇక్కడే ఈ ఊళ్ళోనే ఎం.ఏ. చదివాడు, తరువాత పి.హెచ్‌డి చేసి అమెరికా వెళ్ళి అక్కడా ఏదో చదివి ఉద్యోగం చేస్తున్నట్లున్నాడు. పదేళ్ళ క్రిందట ఇక్కడ చదువుకుంటు న్నప్పుడు తరచు మా ఇంటికి వచ్చేవాడు. అతనికి మా పనిమనిషి వనజతో స్నేహం ఉండేది. మొదట్లో ఆసంగతి నాకు తెలియదు. తరువాత తరువాత తెలిసింది. అతను మా ఇంటికి రావటం మాకోసం కాదని మా పనిమనిషి కోసమని. అప్పుడు చెప్పాను, ఇది ఏమీ బాగులేదని, మా ఇంటికి రావద్దని. అయినా వాళ్ళు చాటుగా కలుసుకోడం మానలేదు. అప్పుడప్పుడూ అతను మా గేటు అవతల నిల్చుని ఉండేవాడు దిక్కుమొహంతో, మా వనజ బైటికి వస్తుందేమోనని ఎదురుచూస్తూ. ఇది సింగారించుకుని ఏదో మిషతో బైటికి వెళ్ళగానే ఇద్దరూ కలిసి ఎక్కడికో పొయ్యేవాళ్ళు. ఈ గ్రంథం ఇలా ఓ ఏడాదిపాటు నడిచింది. తరువాత అతను చదువు పూర్తయి ఈ ఊరునించి వెళ్ళిపోయాడు. తరువాత ఏమైందీ తెలియదు.

పదేళ్లు గడచిపోయాయి. అతనిమాటే మరచిపోయాను. పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. పెళ్ళికొడుకుకేసి తేరిపార జూశాను. అప్పటికి ఇప్పటికి బాగా లావెక్కాడు మదించిన కరికలభంలా ఉన్నాడు. అతని పక్కన సుశీల చెల్లెలు రాధ తెల్లగా సన్నగా నాజూకుగా

ఉంది. సుశీల చెప్పినమాట నిజమే. పాపం ఇద్దరికీ ఈడూ జోడూ కుదరలేదు. పైగా అందరికీ తెలియని రహస్యం నాకోటి తెలుసునుగదా! ఈ రహస్యం కాస్తా ఆ పెళ్ళికూతురి చెవిలో ఊదేస్తే! నువ్వు ఎన్నుకొన్న పెళ్ళికొడుకు పదేళ్ళ క్రిందట మా పనిమనిషికోసం మా ఇంటిముందు పడిగాపులుపడి ఉండేవాడని ఆ పిల్లకి చెపితే! ఆ అమ్మాయి మొహం ఎలా ఉంటుంది? నా ఆలోచన నాకే భయంకరంగా తోచింది!

* * * * *

కొన్నాళ్ళ క్రిందట మా పిన్నికూతురు సరోజ ఈ ఊళ్ళో ఉద్యోగం చేస్తూ ఉండేది. హాస్టల్లో ఉండేది. మా బాబాయి ఎన్ని ప్రయత్నాలు చేసినా దానికి తొందరగా పెళ్ళి కుదరలేదు. ఎలాగో ఒకతనితో దానికి స్నేహం ఏర్పడింది. అతనికి భార్యా ఎదిగిన పిల్లలు ఉన్నారు. దీని వయస్సుకు రెట్టింపు వయస్సు. అతన్ని నాకు పరిచయం చేసింది. అంతా చెప్పింది. అతన్ని శ్రీవారు అనేది. శ్రీవారు, శ్రీమతి అన్న పదాలకు ఈ రోజుల్లో విలువలేకుండా పోయింది. చవకబారుగా తయారయింది. తెలుగు సినిమాలు, తెలుగు పత్రికల పుణ్యమా అని మా వారు, మా ఆవిడ ఫాషన్‌పోయి శ్రీవారు, శ్రీమతి ప్రారంభమయినాయి. పెళ్ళికాని పిల్లలు చాటుగా ఈ పదాలు వాడుతుంటే మనసుకు బాధగా ఉంటుంది.

నేను సరోజను చాలాసార్లు మందలించాను. ఈ వ్యవహారం యేమీ బాగులేదని. అదీ వినిపించుకోలేదు. అదృష్టవశాత్తు తొందరలోనే దానికి పెళ్ళి కుదిరింది. పెళ్ళి చేసుకుని ఉద్యోగం మానేసి స్థిరపడింది. అయినా అప్పుడప్పుడూ ఆలోచన వస్తూ ఉంటుంది. కొన్నాళ్ళు ఒకరిని శ్రీవారుగా సంబోధించి వెంటనే మరొకరిని శ్రీవారుగా స్వీకరించటం ఎలా

సాధ్యమవుతుందీ అని. ఏమో! మనుష్యులు మారుతారు, మనసులు మారుతాయి.

* * * * *

సుశీలవచ్చి నా పక్కన కూర్చుంది. దానికింకా పెళ్ళికొడుకు నలుపన్న గుసుపు పోలేదు. "చాలా నల్లగా ఉన్నాడుకదూ!" అన్నది నాతో. నన్నిప్పుడు పెళ్ళికొడుకు నలుపు ఏమీ బాధించటంలేదు. అతని జీవితంలో పైకి కనిపించకుండా ఉన్న నలుపుమాత్రమే బాధిస్తోంది. అంచేత నేను సుశీలతో ఏమీ అనలేదు. అంతలో ఎవరో పిలిస్తే అది లేచి వెళ్ళింది. నాకూ వెళ్ళిపోవాలనిపించింది. ఆడదాని నోట్లో నువ్వు గింజ నానదంటారు గదా! ఇంకాస్సేపు కూచుంటే ఈ పెళ్ళికొడుక్కూ మా పనిమనిషికీ పదేళ్ళ క్రిందట సంబంధం ఉండేది" అని ఎవరైనా పక్కవాళ్ళతో అనేస్తానేమో నని భయంవేసింది. అంచేత గబుక్కున లేచాను. కాలేజీకి టైమవుతోందని సుశీలతో చెప్పి తాంబూలం తీసుకుని బయటపడ్డాను.

ఇంటికి వెళ్ళేసరికి మా పనిమనిషి వనజ అప్పుడే ఉతికి ఆరేసిన బట్టలు ఇస్త్రీ తోముతోంది నాకు దాన్ని చూడగానే నందన్‌కు పెళ్ళవుతోందని చెపితే దానిముఖం ఎలా ఉంటుందో చూడాలనిపించింది. "ఏమేవ్! పెళ్ళికి వెళ్లివచ్చానుగదా! పెళ్ళికొడుకు ఎవరో తెలుసా? ఇదివరకు మనింటికి వస్తూ ఉండేవాడే, నందన్ అని అతనే" అన్నాను. దానిలో ఎటువంటి చలనమూ లేదు. కనీసం తలయినా ఎత్తలేదు. నిర్లిప్తంగా బట్టలు తోముతోంది. నాకేసిగ్గేసింది. నిజమేమరి అదికూడా ఇప్పుడు పెళ్ళిచేసుకుని ఇద్దరు పిల్లలతో సుఖంగా కాపరం చేస్తోందిగదా!

కాలం గడిచిపోతూ ఉంటుంది. గతం అంతా రాసి చెరిపేసిన అక్షరాలు. ఆ అక్షరాలు ఎవరికీ కనిపించవు. ఎవరికీ పట్టవు.